RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక


దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 226 | పేజీలు : 08 | బుధవారం | 26-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.



మిగతా 2 లో

# నిఘా పెట్టలేదు

## తెలంగాణ డీజీపీ

- ధర్మపురి అర్వింద్ పై పోలీసు నిఘా పెట్టలేదు: తెలంగాణ డీజీపీ
- రేవంత్ సోదరుడి ఆదేశాలతో తనపై పోలీసు నిఘా పెట్టారన్న ధర్మపురి అర్వింద్
- సీఎం కుటుంబ సభ్యుల ఆదేశాలతో పోలీసు శాఖ పనిచేస్తోందా? అని ప్రశ్న
- అర్వింద్ పై నిఘా కోసం ఏ అధికారిని కూడా నియమించలేదన్న డీజీపీ

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు తనపై



# భూసేకరణ వేగవంతం చేయాలి

## అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

- మూసీ ప్రాజెక్ట్ భూసేకరణ వేగవంతం చేయాలి
- మూసీ ప్రాజెక్ట్‌పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధానం రూపొందించాలని అధికారులకు ఆదేశం
- ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రుణాలపై దృష్టి పెట్టాలని కమిషనర్లకు సూచన

మిగతా 2 లో

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

మూసీ ప్రాజెక్టు ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని బోధి పెవెలియన్‌లో మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు. మూసీ ప్రాజెక్ట్ కోసం భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సీఎం తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌తో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్



# ఢిల్లీ కంటే తీవ్రమా?

## బెంగళూరులో విజృంభిస్తున్న హెచ్1ఎన్1..

- ఢిల్లీ, బెంగళూరు నగరాలో పెరుగుతున్న హెచ్1ఎన్1 కేసులు
- బెంగళూరు వాతావరణం వల్లే వ్యాధి వ్యాప్తి ఎక్కువ కాలం
- ఇది కొత్త రకం వైరస్ కాదని స్పష్టం చేసిన ఐసీఎంఆర్
- యాంటీబయాటిక్స్ సొంతంగా వాడొద్దని వైద్యుల హెచ్చరిక
- వ్యాక్సినేషన్‌తో వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చని సూచన

మిగతా 2 లో

హైదరాబాద్ పల్స్,డెస్క్

దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, బెంగళూరులలో హెచ్1ఎన్1 (స్వైన్ ఫ్లూ) కేసులు పెరుగుతున్నప్పటికీ, బెంగళూరులో పరిస్థితి మరీ ఆందోళనకరంగా ఉందని చెప్పలేమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రెండు నగరాల మధ్య నిఘా వ్యవస్థ, పరీక్షల నిర్వహణ తీరు, వాతావరణ పరిస్థితుల్లోని వ్యత్యాసాల కారణంగానే కేసుల సంఖ్యలో ఈ తేడాలు

# అర్హత లేని వ్యక్తులను కలవాలనుకున్నారు..

## రేవంత్ అమెరికా టూర్‌పై కిషన్‌రెడ్డి ఫైర్

- రేవంత్ వ్యాఖ్యలు అర్థరహితమన్న కిషన్‌రెడ్డి
- అమెరికా టూర్‌కు అనుమతి రాలేదని వెల్లడి
- అర్హత లేని వ్యక్తులతో భేటీ అవ్వాలనుకున్నారని వ్యాఖ్య
- మమ్దానీపై కిషన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు
- సీఎం హోదాకు తగిన వారినే కలవాలని సూచన

మిగతా 2 లో



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు.



మిగతా 2 లో


# డ్రా తేదీలు ఖరారు

- హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల డ్రా తేదీలు ఖరారు
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష
- ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి టెండర్లు పూర్తి
- ఈనెల 27, 28, 29, 30 తేదీల్లో డ్రా ద్వారా ఇళ్ల కేటాయింపు

# 30 ఏళ్ల సంకల్పం సాకారం..

## ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం..

- ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల క్రితం తాను శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు వెల్లడి
- నల్లమల సాగర్‌లోకి 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయనున్న ప్రభుత్వం
- పశ్చిమ ప్రకాశం ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ
- వెలిగొండ జలాలతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు వస్తాయని ధీమా



మిగతా 2 లో

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31వ తేదీన ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 1996లో ఉమ్మడి



మిగతా 2 లో

# సమ్మె విరమించిన జూనియర్ డాక్టర్లు

- ఏపీలో సమ్మె విరమించిన జూనియర్ డాక్టర్లు
- సమ్మె విరమిస్తున్నట్టు కోర్టుకు తెలిపిన జూనియర్ డాక్టర్లు
- తమ డిమాండ్లు నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోర్టుకు విన్నపం
- రెండు వారాల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

## స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే

# వైసీపీదే విజయం

- స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకు మాత్రమే సంబంధించినవి కావన్న జగన్
- క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన సమయమని వ్యాఖ్య
- కుటుంబ సభ్యులను బరిలోకి దించేందుకు వెనుకాడవద్దని పిలుపు
- పోటీలు లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని హెచ్చరిక
- పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వ్యాఖ్య

మిగతా 2 లో



హైదరాబాద్ పల్స్,డెస్క్

స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైసీపీ అధినేత జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు

# సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు..

- సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..
- ఎన్నికల వయసు తగ్గింపుపై కీలక తీర్మానం!
- ఎన్నికల్లో పోటీ వయసు 21 ఏళ్లకు తగ్గించాలని తీర్మానం చేసే అవకాశం
- తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్న రేవంత్ ప్రభుత్వం
- నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని శాసనసభ్యులకు సూచన

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని శాసనసభ్యులకు వెల్లడించారు. అయితే, ఈ సమావేశాలు ఎన్ని రోజుల




మిగతా 2 లో

# అర్హత లేని వ్యక్తులను కలవాలనుకున్నారు..

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వంపై సీఎం చేసిన ఆరోపణలు అర్థరహితమని మండిపడ్డారు. ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కేంద్రం అనుమతి రాకముందే రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనను హడావుడిగా ఖరారు చేసుకున్నారని ఆరోపించారు.రేవంత్‌రెడ్డి గతంలో అమెరికా, లండన్ సహా ఇతర దేశాలకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈసారి మాత్రం స్పష్టమైన పరిపాలనా కారణాలతో విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వలేదని చెప్పారు. విదేశీ పర్యటనల్లో ముఖ్యమంత్రి ఎవరిని కలుస్తారు? ఆ సమావేశాలతో దేశానికి ఏమైనా ప్రయోజనం ఉందా? అనే అంశాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుందని వివరించారు.అమెరికా పర్యటనలో రేవంత్‌రెడ్డి అర్హత లేని వ్యక్తులను కలవాలని నిర్ణయించుకున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించే, భారత్‌పై విమర్శలు చేసే వ్యక్తితో సమావేశం ఎందుకని ప్రశ్నించారు. ప్రధాని మోదీని ఉగ్రవాదితో పోల్చిన వ్యక్తి న్యూయార్క్ మేయర్ మమ్దానీ కాదా? అని నిలదీశారు. న్యూయార్క్‌లో హిందువుల పండుగలపై ఆంక్షలు విధించిన వ్యక్తితో సీఎం భేటీ కావడం ఏంటని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి తన హోదాకు తగిన వ్యక్తులతోనే చర్చలు జరపాలని కిషన్‌రెడ్డి సూచించారు. సీఎం స్వయంగా విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పెట్టుబడుల కోసం అధికారుల బృందాన్ని పంపినా ప్రయోజనం ఉంటుందని చెప్పారు. 2005లో గుజరాత్ సీఎంగా ఉన్న నరేంద్ర మోదీ అమెరికా పర్యటనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకున్న విషయాన్ని కూడా కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.

# 30 ఏళ్ల సంకల్పం సాకారం..

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ముఖ్యమంత్రిగా తానే శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును, మళ్లీ తన చేతుల మీదుగానే ప్రారంభించడంపై ఆయన ఎక్స్ వేదికగా భావోద్వేగంతో స్పందించారు. 'వెలిగొండ జలసిరులు -- అభివృద్ధికి రెక్కలు' అంటూ ఆయన తన ఆనందాన్ని పంచుకున్నారు.ఈ చారిత్రక ఘట్టానికి మార్కాపురం జిల్లా వేదిక కానుందని, ఈ సందర్భంగా నల్లమల సాగర్‌లోకి 10.7 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎన్నో అవాంతరాలు, సవాళ్లను అధిగమించి భగీరథ ప్రయత్నంతో వెలిగొండ ఫేజ్-1ను పూర్తి చేసి కరవు నేలకు కృష్ణమ్మ జలాలను అందిస్తున్నామని తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం తాను తీసుకున్న సంకల్పం నేడు సాకారమైందని, తీవ్ర కరవు ప్రాంతమైన ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల జీవితాల్లో ఇది గొప్ప మార్పు తీసుకువస్తుందని అన్నారు. ఈ మేరకు 1996 మార్చి 5న తాను శంకుస్థాపన చేసిన నాటి ఫొటోను ప్రస్తుత ట్వీట్‌కు జత చేశారు.ఈ ప్రాజెక్టుతో తరతరాలుగా కరవుతో పోరాడుతున్న ప్రజలకు శాశ్వత ఉపశమనం కలుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఫేజ్-1తో 1.19 లక్షల ఎకరాలకు, ఫేజ్-2 పూర్తయితే మరో 3.28 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. కేవలం సాగునీరే కాకుండా, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించి, పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. "దుర్భిక్ష ప్రాంతమైన మార్కాపురానికి వెలిగొండ ఒక వెలుగుల దండ అవుతుంది" అని ఆయన అభివర్ణించారు.ప్రాజెక్టుతో పాటు ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు రూ.1 లక్ష కోట్లతో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. బెంగళూరు-అమరావతి హైవే, రామాయపట్నం పోర్టులతో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుస్తామని చెప్పారు. "ప్రతి రైతు పొలానికి నీరు, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి కుటుంబానికి భరోసా... ఇదే 'సీబీఎన్ అనే నేను' సంకల్పం" అని చంద్రబాబు తన ట్వీట్‌లో స్పష్టం చేశారు. ప్రతి పౌరుడూ 'నేను...' అనే స్ఫూర్తితో పనిచేసి జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు

# సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు..

మొదటి పేజీ తరువాయి

పాటు కొనసాగుతాయి, సభా అజెండా ఏమిటన్న అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.ఈ సమావేశాల్లో ప్రభుత్వం ఒక కీలక తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉంది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ సభలో తీర్మానం చేయనున్నారు. అనంతరం దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపి, పార్లమెంటులో సంబంధిత బిల్లును ప్రవేశపెట్టాలని కోరనున్నారు. చట్టసభల్లో యువతకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ మార్పును ప్రతిపాదిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోనే పేర్కొన్నారు.నియోజకవర్గాల అభివృద్ధి పనులపై కూడా ముఖ్యమంత్రి ఈ సమావేశంలో సమీక్ష జరిపారు. పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆయన ఎమ్మెల్యేలను ఆదేశించారు. భూసేకరణలో జాప్యం జరిగితే ప్రాజెక్టుల నిర్మాణం నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ శాఖ అనుమతులకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి ఎమ్మెల్యే తమ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు

## స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే
# వైసీపీదే విజయం

మొదటి పేజీ తరువాయి

సంబంధించినవి మాత్రమే కావని... క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్న ఆయన.. ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు తమ కుటుంబ సభ్యులను సైతం బరిలోకి దించేందుకు వెనకాడకూడదని పిలుపునిచ్చారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని... ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కో-ఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు.పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని... సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి వీటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 'వెన్నుపోటు పార్టీ - వెన్నుపోటు పాలన' అనే నినాదంతో గ్రామ స్థాయిలో వైసీపీ - కూటమి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.కార్యకర్తలను రక్షించుకోవడానికి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా సెల్స్‌ను బలోపేతం చేయాలని... అవసరమైతే కేసులు హైకోర్టు వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, 'జగన్ 2.0 సూపర్ యాప్', యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతూ, రాజకీయ ఒత్తిళ్లతో చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారుల పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి, భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు తమ ఈగోలను పక్కనపెట్టి, రాబోయే 60-70 రోజులు నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# నిఘా పెట్టలేదు

మొదటి పేజీ తరువాయి

పోలీసు నిఘా ఉంచారని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ చేసిన సంచలన ఆరోపణలను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తోసిపుచ్చారు. రేవంత్ సోదరుడి సూచనల మేరకు తన కదలికలపై నిఘా ఉంచేందుకు ఒక ఏసీపీ స్థాయి పోలీసు అధికారిని నియమించారంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎక్స్ వేదికగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి సంచలన పోస్ట్ చేశారు. తెలంగాణ పోలీసు యంత్రాంగం భారత రాజ్యాంగానికి, చట్టబద్ధమైన అధికార పరిధికి కట్టుబడి పనిచేస్తోందా లేక సీఎం కుటుంబ సభ్యుల ఆదేశాలతో నడుస్తోందా అని ఆయన తన ట్వీట్‌లో ప్రశ్నించారు. ఎంపీ పోస్టుపై వెంటనే స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, సంబంధిత అధికారులతో సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను ధ్రువీకరించుకున్నామని తెలిపారు. ఎంపీని అనుసరించడానికి గానీ, ఆయనపై నిఘా ఉంచడానికి గానీ ఏ అధికారిని నియమించలేదని స్పష్టం చేశారు. తెలంగాణ పోలీసు శాఖ ఇటువంటి నిఘా పద్ధతులను ఎన్నడూ అనుసరించదని, కేవలం రాజ్యాంగబద్ధమైన విధులకు మాత్రమే కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. అయినప్పటికీ, ఈ వ్యవహారానికి సంబంధించి ఎంపీ వద్ద ఏవైనా నిర్దిష్టమైన ఆధారాలు లేదా సమాచారం ఉంటే నేరుగా తనకు వ్యక్తిగతంగా అందజేయవచ్చని, వాటి ఆధారంగా పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపిస్తానని డీజీపీ హామీ ఇచ్చారు. డీజీపీ ఇచ్చిన ఈ వివరణతో ఎంపీ వర్సెస్ పోలీసు నిఘా వివాదంలో చెలరేగిన రాజకీయ దుమారానికి తెరదించే ప్రయత్నం చేశారు.

# ఢిల్లీ కంటే తీవ్రమా?

మొదటి పేజీ తరువాయి

కనిపిస్తున్నాయని వారు వివరిస్తున్నారు.ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఆగస్టు 20 నాటికి ఢిల్లీలో 1,777 కేసులు నమోదయ్యాయి. మరోవైపు, బెంగళూరులోని ఒక పాఠశాలలో 500 మందికి పైగా విద్యార్థులు, సిబ్బంది ఫ్లూ లక్షణాలతో బాధపడగా, వారిలో ఇద్దరికి స్వైన్ ఫ్లూ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అయితే, ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నది కొత్త రకం వైరస్ కాదని, అందుబాటులో ఉన్న వ్యాక్సిన్‌ల ద్వారా నివారించదగ్గ పాత స్ట్రెయిన్ మాత్రమేనని ఐసీఎంఆర్ స్పష్టం చేసింది.బెంగళూరు వాతావరణం కారణంగా ఇక్కడ శ్వాసకోశ సంబంధిత వైరల్ ఇన్ఫెక్షన్లు ఎక్కువ కాలం ప్రభావాన్ని చూపుతాయని ఆస్టర్ వైట్‌ఫీల్డ్ హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ ఐశ్వర్య తెలిపారు. సాధారణంగా జూన్ నెలలో ప్రారంభమయ్యే ఈ కేసులు, జనవరి-ఫిబ్రవరి వరకు కొనసాగుతాయని, దీనివల్ల వ్యాధి వ్యాప్తి సుదీర్ఘకాలం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.ప్రస్తుతం పొడి దగ్గు, గొంతు నొప్పి, జ్వరం, కండరాల నొప్పులు, తీవ్రమైన నీరసం వంటివి ప్రధాన లక్షణాలుగా కనిపిస్తున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులతో పాటు ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాల సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, సొంతంగా యాంటీబయాటిక్స్ వాడకూడదని హెచ్చరిస్తున్నారు. వ్యాక్సినేషన్ తీసుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను, ఆసుపత్రిలో చేరాల్సిన ముప్పును తగ్గించుకోవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు.

## సమ్మె విరమించిన
# జూనియర్ డాక్టర్లు

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న జూనియర్ వైద్యుల (జూడా) సమ్మెకు తెరపడింది. తమ సమ్మెను విరమిస్తున్నట్లు జూనియర్ వైద్యుల సంఘం ప్రతినిధులు హైకోర్టుకు స్వయంగా నివేదించారు.జూనియర్ వైద్యుల సమ్మెపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా, విధుల్లోకి చేరుతున్నామని చెబుతూనే సమ్మెను విరమిస్తున్నట్లు జూడాలు న్యాయస్థానానికి స్పష్టం చేశారు. అదే సమయంలో, తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు.జూనియర్ వైద్యులు లేవనెత్తిన డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన హైకోర్టు, వారి సమస్యల పరిష్కారంపై రెండు వారాల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ఇచ్చిన ఈ స్పష్టమైన ఆదేశాలతో జూనియర్ వైద్యులు తమ నిరసనను ఉపసంహరించుకోవడంతో, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి.

# డ్రా తేదీలు ఖరారు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు 40,900 మంది అర్హులను గుర్తించినట్లు రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ నెల 27 నుంచి నాలుగు రోజుల పాటు లాటరీ ద్వారా ఇళ్లు కేటాయించనున్నట్లు చెప్పారు. ఇళ్లు రాని వారికి రూ.10 వేలు తిరిగి ఇస్తామని మంత్రి తెలిపారు. టవర్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. ఎల్బీనగర్, గోషామహల్, నాంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల కోసం సెప్టెంబరు 3 వరకు దరఖాస్తు చేసుకోవాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.ఇందిరమ్మ టవర్ల నిర్మాణం,దరఖాస్తులు, లాటరీ ప్రక్రియపై సచివాలయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. క్యూర్‌లోని 16 నియోజకవర్గాల్లో రూ.807 కోట్ల 40 లక్షలతో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్ల కోసం 60,720 మంది దరఖాస్తు చేశారు. దరఖాస్తుల్లో 40,900 మంది అర్హులు 19,820 అనర్హులుగా తేలినట్లు మంత్రి తెలిపారు.

**డ్రా రాకుంటే రూ.10 వేల తిరిగి ఇస్తాం**

అర్హులకు ఈ నెల 27 నుంచి 30 వరకు వివిధ ప్రాంతాల్లోని ఫంక్షన్‌హాళ్లలో దరఖాస్తుదారుల సమక్షంలో పారదర్శకంగా డ్రా ద్వారా ఇండ్లు కేటాయించనున్నారు. ఈ నెల 27న రాయదుర్గం, కేపీహెచ్‌బీ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి, రెడ్‌హిల్స్ 28వ తేదీన కౌకూర్, పాటిగడ్డ, జల్‌పల్లి, కుల్సుంపురాలో లాటరీ ప్రక్రియ ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ నెల 29న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయిన్‌పల్లి, బండ్లగూడ ఎల్ఐజీ కాలనీ, నందిముసలిగూడలో 30వ తేదీన గాజుల రామారం, అంబర్‌పేట సిటీపోలీస్‌లైన్, గడ్డిఅన్నారం ఆర్అండ్‌బీ క్వార్టర్స్, పోచారం ఎల్ఐజీ కాలనీలో డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇళ్లు రాని వారికి రూ.10 వేల తిరిగి ఇవ్వనున్నట్లు చెప్పారు.

**ఆత్మగౌరవంతో జీవించే అవకాశం**

ఎల్‌బీనగర్, గోషామహల్, ముషీరాబాద్, చంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తుల గడువు సెప్టెంబరు 3తో ముగియనుంది. ఒక్కో నియోజకవర్గంలో 480 చొప్పున ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పేదలకు అపార్టుమెంట్‌లో ఒక ఫ్లాటు ఇవ్వడం కాదని, ఒక కుటుంబానికి నగరంలో విలువైన ఆస్తి, భద్రమైన భవిష్యత్, ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించడమే ఇందిరమ్మ టవర్ల లక్ష్యమని మంత్రి తెలిపారు.

**ఏడాదిలోగా లబ్ధిదారులకు ఇళ్లు**

లబ్ధిదారులకు కేటాయించే ఇంటి వరకు సుమారు 60 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఉంటుందని మంత్రి అన్నారు. స్థలం ఉచితంగా ఇవ్వడంతో పాటు రిజిస్ట్రేషన్, రూ.5 లక్షల సబ్సిడీ ప్రభుత్వమే ఇస్తోందనిన్నారు. లబ్ధిదారుడు రూ.6 లక్షలు నాలుగు విడుతల్లో చెల్లించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల టవర్లకు కేపీహెచ్‌బీ కాలనీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల లాంఛనంగా ప్రారంభించారు. ఏడాదిలోగా లబ్ధిదారులకు ఇళు అప్పగించనున్నట్లు మంత్రి తెలిపారు.

# భూసేకరణ వేగవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి

భూముల సేకరణపై స్పష్టమైన విధానం తయారు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. భూసేకరణలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలని చెప్పారు. మూసీ ప్రాజెక్టు రెండో దశకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

**తక్కువ వడ్డీ రుణాలపై దృష్టి సారించాలి**

మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం వెంటనే టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కోసం తక్కువ వడ్డీకి రుణాల సమీకరణపై దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్లకు దిశానిర్దేశం చేశారు. కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్కుకు మరింత ప్రచారం కల్పించాలన్నారు. టీడీఆర్‌పై ప్రతీ వారం సమీక్ష జరగాలని సీఎం స్పష్టం చేశారు. సమీక్షలో ఉన్నతాధికారులు మాణిక్ రాజ్, సర్ఫరాజ్ అహ్మద్, ఆర్వీ కర్ణన్, వినయ్?కృష్ణా రెడ్డి, సృజన, నారాయణ రెడ్డి, మను చౌదరి, నరసింహ రెడ్డి, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

**సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు..**

తెలంగాణ శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని శాసనసభ్యులకు వెల్లడించారు. అయితే, ఈ సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయి, సభా అజెండా ఏమిటన్న అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.ఈ సమావేశాల్లో ప్రభుత్వం ఒక కీలక తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉంది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ సభలో తీర్మానం చేయనున్నారు. అనంతరం దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపి, పార్లమెంటులో సంబంధిత బిల్లును ప్రవేశపెట్టాలని కోరనున్నారు. చట్టసభల్లో యువతకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ మార్పును ప్రతిపాదిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోనే పేర్కొన్నారు.నియోజకవర్గాల అభివృద్ధి పనులపై కూడా ముఖ్యమంత్రి ఈ సమావేశంలో సమీక్ష జరిపారు. పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆయన ఎమ్మెల్యేలను ఆదేశించారు. భూసేకరణలో జాప్యం జరిగితే ప్రాజెక్టుల నిర్మాణం నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ శాఖ అనుమతులకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి ఎమ్మెల్యే తమ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు

# జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం పాదయాత్ర పోస్టర్ విడుదల

**ఈనెల 29, 30 ,31 భువనగిరి జిల్లా కేంద్రం నుండి ఇందిరా పార్క్ వరకు పాదయాత్రను జయప్రదం చేయండి**

**ఎంఏ ఇక్బాల్ సిపిఎం జిల్లా నాయకులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మంగళవారం రోజున యాదాద్రి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 29,30 రెండు రోజులు చేయతలపెట్టిన రెండు పాదయాత్ర 31న ఇందిరా పార్కులో ధర్నాను జయప్రదం చేయాలని ఆలేరు పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్ మాట్లాడుతూ... జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ తో పాదయాత్ర కార్యక్రమం నడుస్తుందని అందులో భాగంగా ఆలేరు ప్రాంతంలోని గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలని అదేవిధంగా గత 15 సంవత్సరాల క్రితం దేవాదుల ప్రాజెక్టులో భాగంగా పటేల్ గూడెం, గుండ్లగూడెం, టంగుటూరు గ్రామాలకు సంబంధించిన వరద కాలువలు తీసి ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేయకపోవడం వలన కోట్లాది రూపాయల ప్రజాధనం వృధాగా పోయిందని వెంటనే దేవాదులలో భాగంగా తీసిన కాలువలకు నీరు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆలేరు ప్రాంతానికి



సాగు తాగునీరు అందించే గంధమల్ల రిజర్వాయర్ మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి హయంలో 11 టీఎంసీలుగా ప్రతిపాదనలు చేసినప్పటికీ తర్వాత దాన్ని ఆరు టీఎంసీలకు తగ్గించారు ప్రస్తుతం 1.41 టీఎంసీలతో దాన్ని మంజూరు చేశారు. దీనివల్ల తుర్కపల్లి, రాజపేట, ఆలేరు మండలాలకు చెందిన 58 వేల ఎకరాల సాగు విస్తీర్ణం అవుతుందని అధికారులు చెప్పారు. దీని డిపిఆర్ ను మార్చడం వల్ల ప్రస్తుతం 52,000 ఎకరాలకే నీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు ప్రభుత్వం గంధమల్ల ప్రాజెక్టు నిధులు కేటాయించినట్లు చెబుతున్నప్పటికీ డిజైన్ మార్పిడి వల్ల ఎన్ని ఎకరాలకు నీరు అందిస్తుందో చెప్పలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారని వెంటనే డిజైన్ పూర్తి చేసి గంధమల్ల రిజర్వాయర్ ను త్వరితగతిన పూర్తి చేసి ఆలేరు ప్రాంతానికి సాగు తాగునీరు అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గత ఎన్నికలకు ముందు అధికారంలోకి రాగానే గంధమల్ల రిజర్వాయర్లు పూర్తిచేస్తామని చెప్పిన పాలకులు అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ గంధమల్ల ప్రాజెక్టులో ఇంతవరకు తట్టెడు మట్టి తీయలేదని ఈ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందని వెంటనే గంధమల్ల రిజర్వాయర్ పనులు పూర్తిచేసి దేవాదుల ప్రాజెక్టు సంబంధించిన కాలువలకు నీరు విడుదల చేయాలని ఈ డిమాండ్ తో 29,30 భువనగిరి జిల్లా కేంద్రం నుండి ఇందిరా పార్క్ వరకు పాదయాత్ర నడుస్తుందని ఇందులో రైతులు ప్రజాతంత్ర వాదులు అందరూ కలిసి రావాలని అదేవిధంగా 31 రోజుల ఇందిరా పార్క్ లో సంబంధిత ప్రాజెక్ట్ లకు సంబంధించిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించినట్లు ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర నాయకత్వం హాజరుకానునట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం జరిగిన ప్రతి పోరాటానికి ఇక్కడి ప్రాంత ప్రజలు రైతులు ఎంతో తోడ్పాటు అందించే వారిని భవిష్యత్తులో కూడా సిపిఎం పార్టీ తీసుకుంటున్న ఈ ప్రజా పోరాటాలకు రైతులు సబ్బండ వర్గాల నుండి మద్దతు ఇచ్చి సమస్యల పరిష్కారం కోసం కలిసి రావాలని ఈ సందర్భంగా ఆయన రైతాంగానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మొరిగాడి రమేష్, జూకంటి పౌలు, కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ బొమ్మకంటి లక్ష్మీనారాయణ, తాళ్లపల్లి గణేష్, బొప్పిడి యాదగిరి, కాసుల నరేష్, ఘనగాని మల్లేష్, చౌడబోయిన మద్దెల కుమార్, యాదగిరి, ఘనగాని రాజు, ఎండి మతిన్, ఎండి ఖలీల్, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వ్యాసారపు ప్రసాద్, సీనియర్ నాయకులు మొరిగాడి అశోక్, మరిగాడి అంజయ్య, బర్ల సిద్ధులు తదితరులు పాల్గొన్నారు

# సెప్టెంబర్ 9న చలో వరంగల్ ఎమ్మార్పీఎస్ జాతీయ మహా సభను విజయవంతం చేద్దాం..

**అసమానతలు లేని సమాజాన్ని నిర్మిద్దాం..**

**యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్ట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి మండల స్థాయి సమావేశం మండల ఇంచార్జీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, కో ఇంచార్జ్ సుంచు ప్రేమ్ మాదిగ, పట్టణ ఇంచార్జీ ఆకారపు లక్ష్మీ నారాయణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ... పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు సెప్టెంబర్ 9న వరంగల్ లో జరుగబోయే జాతీయ ఎంఆర్పిఎస్ ఎంఎస్పి నూతన మండల కమిటీ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. అసమానతలు లేని సమాజ నిర్మాణకై ముందుకు నడువాలని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎమ్మార్పియస్



ఆలేరు నియోజకవర్గం ఇంచార్జీ నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు సామాజిక, ఆర్థిక అసమానతల పై భవిష్యత్ ఉద్యమం జరుగుతుంది అని సమాజంలో అందరిని కలిపి ఉద్యమాలకు సిద్ధం చేయాలని అన్నారు.. అనంతరం ఎంఆర్పిఎస్, ఎంఎస్పీ, యంఎస్ఎఫ్ యాదగిరిగుట్ట మండల కమిటి, పట్టణ కమిటీ ఎన్నిక జరిగిందినూతన యాదగిరిగుట్ట ఎమ్మార్పియస్ మండల కమిటీ అధ్యక్షులుగా బీబీనగరం లక్ష్మణ్ మాదిగ, అధికార ప్రతినిధిగా సుంచు సిద్దు మాదిగ, ఉపాధ్యక్షుడు వద్దిగళ్ల రాజు మాదిగ, ఉపాధ్యక్షులుగా పూలేపాక జీవన్ మాదిగ, ప్రధాన కార్యదర్శి ఒగ్గు అనిల్ బైండ్ల లను, ఎంపిక



చేశారుఎంఎస్పీ మండల కమిటీ అధ్యక్షులుగా పూలెపాక విజయ్ మాదిగ, కార్యదర్శిగా సుంచు కరుణాకర్ మాదిగ, అధికార ప్రతినిధిగా బొట్టు ప్రభాకర్ మాదిగ, ఉపాధ్యక్షులుగా గుడ్ల శ్రీనివాస్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా ఒగ్గు ప్రభాకర్ మాదిగ, పట్టణ అధ్యక్షులు గా బూడిద సింహాద్రి మాదిగ, మాదిగ విద్యార్థి సమాఖ్య మండల అధ్యక్షులు మైలారం బాబు మాదిగ లు ఎన్నికయ్యారు

# భువనగిరి పట్టణంలో ఘనంగా “వన”మహోత్సవం వేడుకలు

**పలు వార్డుల్లో (8,35,21) మొక్కలు పంపిణీ**

**“వన”మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో “వన” మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా కొనసాగాయి. మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పలు వార్డుల్లో మొక్కల పంపిణీ.. మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. 8వ వార్డులో కౌన్సిలర్ తహెరా బబ్లు ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని చైర్మన్ ప్రారంభించి మొక్కలు నాటారు. 35వ మరియు 21వ వార్డులలో స్థానిక కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ప్రజలకు మొక్కల పంపిణీ



కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ తంగాళ్ళ పల్లి శ్రీవాణి రవి కుమార్ మాట్లాడుతూ... పచ్చదనమే మన లక్ష్యమని, భువనగిరిని హరిత భువనగిరిగా మార్చేందుకు ప్రతి వార్డులో మొక్కలు నాటుతున్నామని, ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి, కౌన్సిలర్లు తహెరా బబ్లు,



వంగేటి సుచరిత రెడ్డి తుమ్మేటి పాండు, కో-ఆప్షన్ మెంబర్ కౌసర్ భాయ్, నూతన డిఇ, ఏఈ, కాంగ్రెస్ నాయకులు షేక్ మజర్ పాషా, కూర శివకుమార్, గణేష్, నరేష్ వినయకుమార్ మున్సిపల్ అధికారులు సిబ్బంది వార్డ్ ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఉగ్రవాదంపై పోరులో మహిళా కమాండోలు

**తొలిసారిగా ప్రత్యేక శిక్షణ ప్రారంభించిన జాతీయ భద్రతా దళం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 25**
**(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో మహిళా సిబ్బంది పాత్రను మరింత బలోపేతం చేసే దిశగా జాతీయ భద్రతా దళం కీలక ముందడుగు వేసింది. తొలిసారిగా మహిళా సిబ్బందికి ప్రత్యేక కమాండో శిక్షణను ప్రారంభించింది. హరియాణాలోని మానేసర్‌లో ఉన్న జాతీయ భద్రతా దళం శిక్షణ అకాడమీలో ప్రారంభమైన ఈ 12 వారాల శిక్షణలో రాష్ట్ర పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన మహిళా సిబ్బంది పాల్గొంటున్నారు. శిక్షణలో ఆయుధాల వినియోగం, కాల్పులు, లక్ష్యసాధన, వ్యూహాత్మక చర్యలు, బందీలను రక్షించడం వంటి అంశాలతో పాటు శారీరక దృఢత్వం, సాంకేతిక, కార్యాచరణ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం మహిళా సిబ్బంది తమ తమ బలగాల్లో విధుల్లో చేరి, జాతీయ భద్రతా దళంలో పొందిన నైపుణ్యాలను వినియోగించనున్నారు. దీనివల్ల భద్రతా బలగాల మధ్య సమన్వయం, ఉగ్రవాద వ్యతిరేక సన్నద్ధత మరింత మెరుగుపడుతుందని జాతీయ భద్రతా దళం తెలిపింది. మారుతున్న అంతర్గత భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా మహిళా సిబ్బందిని తీర్చిదిద్దడమే ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని పేర్కొంది. మహిళా సాధికారతతో పాటు దేశ భద్రతలో వారి పాత్రను మరింత బలోపేతం చేసే దిశగా ఇది కీలక అడుగుగా అభివర్ణించింది.






# బాధిత కుటుంబానికి మరోసారి సీఎం సహాయనిధి అండ

**రూ.లక్ష విలువైన ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్**

**ఆగస్టు 25, పికెట్,(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి)**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఈస్ట్ మారేడ్‌పల్లిలోని మహాత్మా గాంధీ నగర్‌కు చెందిన జంగల్బోయ్ సంతోష్ తీవ్ర అనారోగ్యంతో పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ వెంటనే స్పందించి సీఎం సహాయనిధి నుంచి రూ.లక్ష విలువైన ఎల్ఓసీని మంజూరు చేయించి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇదే బాధితుడికి గతంలోనూ ఎమ్మెల్యే చొరవతో సీఎం సహాయనిధి నుంచి రూ. 2 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరైంది. అయితే సంతోష్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు మరోసారి ఎమ్మెల్యేను ఆశ్రయించారు. వారి విజ్ఞప్తికి స్పందించిన ఆయన అదనంగా మరో రూ.లక్ష విలువైన ఎల్ఓసీని మంజూరు చేయించారు. ఆపద సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచి వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన సీఎం, ఎమ్మెల్యేకు సంతోష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి రవి కుమార్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డులో ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మున్సిపల్ చైర్మన్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ నూతన డ్రైనేజీ మోరీ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభం చేసారు. ఈ సందర్భంగా చైర్మన్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ మాట్లాడుతూ... గత కొంతకాలంగా వర్షం వస్తే వార్డులో మురుగునీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని గుర్తించి ప్రత్యేక నిధులతో మోరీ పనులు మంజూరు చేయించామని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు దశలవారీగా చేపట్టి భువనగిరిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి, కౌన్సిలర్లు తహెరా బబ్లు, తుమ్మేటి పాండు, నూతన డీఈ, ఏఈ సురేష్, నాయకులు గణేష్, కూర శివకుమార్, నరేష్, వార్డు అధికారులు, ఆర్పీలు, స్థానిక మహిళలు, వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎంఆర్పీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ గా యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామానికి చెందిన పులేపాక బిక్షపతిని యాదాద్రి భువనగిరి జిల్లా గౌరవాధ్యక్షులుగా, మల్లాపురం గ్రామానికి చెందిన చల్లూరు యాదగిరిని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా కేంద్రం నల్లగొండ లో జరిగిన సమావేశంలో ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బట్టు దాస్ రావు, రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ మాదిగ, రాష్ట్ర నాయకులు గంటా సుదర్శన్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల బిక్షపతి మాదిగ, ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## 22ఏ బాధితులకు అండగా

# ఈ నెల 29న అమీన్‌పూర్‌లో ధర్నా

**నిషేధిత జాబితా నుంచి నిజమైన భూములను తొలగించే వరకు పోరాటం. మహిపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి**

**పటాన్‌చెరు, ఆగస్టు 25,(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**



పటాన్‌చెరు నియోజకవర్గంలో 22ఏ నిషేధిత జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు అండగా ఈ నెల 29న అమీన్‌పూర్‌లో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి తెలిపారు. ధర్నాకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేత హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు



వెల్లడించారు. ధర్నా ఏర్పాట్లపై మంగళవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం, 22ఏ బాధితుల సమస్యలపై చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా చట్టబద్ధంగా నివసిస్తూ, హెచ్ఎండీఏ, హుడా అనుమతులతో కొనుగోలు చేసిన భూములు సైతం 22ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. నిజమైన హక్కుదారుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 22ఏ సమస్య పరిష్కారం కోసం ఈ నెల 29న అమీన్‌పూర్‌లో నిర్వహించే ధర్నాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాధితులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిజమైన భూములను 22ఏ జాబితా నుంచి తొలగించే వరకు బాధితులకు అండగా పోరాటం కొనసాగిస్తామని మహిపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ శాసనసభా కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్

## వెనుకబడిన తరగతుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తా

**ఆగస్టు 25, నాంపల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
తెలంగాణ శాసనమండలి సమావేశ మందిరంలో మంగళవారం బీసీ సంక్షేమ శాసనసభా కమిటీ ప్రాథమిక సమావేశం నిర్వహించారు. సమావేశంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి ఉపాధ్యక్షుడు బండ ప్రకాష్, శాసనమండలి, శాసనసభ కార్యదర్శులు నరసింహాచార్యులు, రేండ్ల తిరుపతి పాల్గొన్నారు. బీసీ సంక్షేమ శాసనసభా కమిటీ ఛైర్మన్ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో పాటు కమిటీ సభ్యులుగా నియమితులైన ఎమ్మెల్యే శ్రీగణేష్, భూపతిరెడ్డి, చింతా ప్రభాకర్, రామారావు పవార్,




ఎల్. రమణ, తీన్మార్ మల్లన్నలను ఈ సందర్భంగా అభినందించారు. సమావేశంలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన వెనుకబడిన తరగతుల సంక్షేమానికి సంబంధించిన కమిటీలో తనను సభ్యుడిగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రివర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కమిటీ ఛైర్మన్ సారథ్యంలో సమష్టిగా కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. వెనుకబడిన తరగతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# వన మహోత్సవంలో మొక్కలు నాటిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

## మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం: తిరుమలాపురం గ్రామంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొని ఉపాధి హామీ కూలీలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, గ్రామ ప్రజలకు సూచించారు. మొక్కలు నాటడం ఒక్కటే కాకుండా వాటిని క్రమం తప్పకుండా సంరక్షించి, పెరిగే వరకు బాధ్యత తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా మారిందని బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. చెట్ల సంఖ్య పెరిగితే వాతావరణ



కాలుష్యం తగ్గడంతో పాటు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. చెట్లు మానవ జీవనానికి ఎంతో కీలకమని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధి, పచ్చదనం పెంపు వంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని అన్నారు. గ్రామాల్లో రహదారుల వెంట, ప్రభుత్వ స్థలాల్లో, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. "మొక్కలు నాటడం మన బాధ్యత.. వాటిని సంరక్షించడం మన కర్తవ్యం. పచ్చదనం పెంచి పర్యావరణాన్ని కాపాడితేనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలం" అని బీర్ల ఐలయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మోదీని ఉగ్రవాదితో పోల్చిన మమ్దానీతో భేటీలా?..

## రేవంత్ అమెరికా పర్యటనపై కిషన్‌రెడ్డి ఫైర్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, సెంట్రల్ డెస్క్:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై రాజకీయ దుమారం కొనసాగుతోంది. ఈ వ్యవహారంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. కేంద్ర అనుమతి రాకముందే ముఖ్యమంత్రి అమెరికా పర్యటనను హడావుడిగా ఖరారు చేసుకున్నారని విమర్శించారు. విదేశీ పర్యటనల విషయంలో ముఖ్యమంత్రి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో రేవంత్‌రెడ్డి అమెరికా, లండన్ తదితర దేశాల్లో పర్యటించేందుకు కేంద్రం అనుమతించిందని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. అయితే ప్రస్తుత పర్యటనకు విదేశాంగ శాఖ స్పష్టమైన పరిపాలనా కారణాలతోనే అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ముఖ్యమంత్రి అమెరికా పర్యటనలో ఎవరెవరిని కలవాలనుకున్నారనే అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీతో రేవంత్‌రెడ్డి భేటీ కావాలనుకోవడంపై కిషన్‌రెడ్డి ప్రశ్నలు సంధించారు. ప్రధాని నరేంద్ర మోదీపై మమ్దానీ గతంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారని, అలాంటి వ్యక్తితో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించడం సముచితమా అని ప్రశ్నించారు. భారత్, ప్రధాని మోదీ పట్ల మమ్దానీ వైఖరిని కూడా ఆయన విమర్శించారు. 2005లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ అమెరికా పర్యటనకు అప్పటి కేంద్ర ప్రభుత్వం అనుమతి




ఇవ్వలేదని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనల్లో ఎవరిని కలుస్తారు, ఆ సమావేశాల వల్ల దేశానికి, రాష్ట్రానికి కలిగే ప్రయోజనం ఏమిటనే అంశాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుందని తెలిపారు. అందువల్ల అనుమతి నిరాకరణను రాజకీయ కోణంలో చూడటం సరికాదన్నారు. పెట్టుబడుల కోసం ముఖ్యమంత్రి స్వయంగా విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని కిషన్‌రెడ్డి అన్నారు. అవసరమైతే అధికారుల బృందాలను విదేశాలకు పంపించి పెట్టుబడులను ఆకర్షించవచ్చని సూచించారు. రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై కేంద్రాన్ని విమర్శించిన నేపథ్యంలో కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.







# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

## ప్రతి ఒక్కరూ ఆరు మొక్కలు నాటి సంరక్షించాలి: సర్పంచ్ దొంతు శారద రవి

**నర్సింహులపేట, ఆగస్టు 25 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ముంగిమడుగు సర్పంచ్ దొంతు శారద రవి పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో ఉపసర్పంచ్ దొంతు మహేష్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మానవాళి మనుగడ మొక్కలతోనే ముడిపడి ఉందని, కాలుష్య నివారణతో పాటు స్వచ్ఛమైన గాలి అందాలంటే చెట్లను విరివిగా పెంచాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు గాడుపల్లి నాగముని, పంచాయతీ కార్యదర్శి నివాస్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వనమహోత్సవంలో మొక్కలు నాటిన సర్పంచ్

## ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి సంరక్షించాలి. సర్పంచ్ సోనియా హరిలాల్

**నర్సింహులపేట, ఆగస్టు 25 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
వనమహోత్సవంలో భాగంగా నర్సింహులపేట మండలం పెద్దనాగారం స్టేజ్ గ్రామపంచాయతీలో సర్పంచ్ భూక్య సోనియా హరిలాల్ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. చెట్లు ఆక్సిజన్ అందించడంతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వనమహోత్సవ స్ఫూర్తితో గ్రామ ప్రజలు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవిబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, కార్యదర్శి మౌనిక, వార్డు సభ్యుడు లునావత్ జగ్గు, నాయకులు హరిలాల్, భాస్కర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

## అర్హులకు సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా కృషి. ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్



**నర్సింహులపేట, ఆగస్టు 25(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్ అన్నారు. నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మహిపాల్ రెడ్డి తల్లి సుగుణమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామచంద్రు నాయక్ మంగళవారం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: సర్పంచ్ మురళి**




**చర్ల, ఆగస్టు 25 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తేగడ గ్రామపంచాయతీలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ జమ్ముల మురళి, పంచాయతీ కార్యదర్శి సురేష్, వార్డు సభ్యులు, విద్యార్థులు, సిబ్బంది కలిసి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మురళి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. చెట్లను కాపాడుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను పరిరక్షించవచ్చని తెలిపారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచి పచ్చదనాన్ని పెంచాలని సూచించారు.

## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసిన దుద్దు రాహుల్

**టీటీడీ మహా ప్రసాదం అందజేత**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా సాంస్కృతిక సేన అధ్యక్షుడు దుద్దు రాహుల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం మహా ప్రసాదాన్ని ఆయనకు అందజేశారు. శ్రీవేంకటేశ్వర స్వామివారి మహా ప్రసాదాన్ని అందించడం ఆనందంగా ఉందని దుద్దు రాహుల్ తెలిపారు. అనంతరం ఇరువురు పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హోంమంత్రి అమిత్ షా కు వ్యతిరేకంగా నిరసన

**విద్యార్థులపై దాడులను ఖండించిన భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్,**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగం ఘటనపై భువనగిరి యూత్ కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. భువనగిరి పట్టణ ప్రధాన కూడలిలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, టిపిసిసి సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్ లు మాట్లాడుతూ..."దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగించమని ఆదేశాలు ఇచ్చింది ఎవరు? కేంద్ర హోంమంత్రి అమిత్ షా దీనికి జవాబు చెప్పాలి" అని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వం, విద్యార్థుల ఉద్యమాన్ని అణచివేయడానికి ఇలాంటి అమానవీయ చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కడమేనని అన్నారు. విద్యార్థుల రక్తంతో చేతులు కడుక్కున్న అమిత్ షా వెంటనే తన హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని "అమిత్ షా మస్ట్ గో" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ దమనకాండపై ప్రధాని మోడీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ విద్యార్థి లోకానికి అండగా ఉంటుందని, యూత్ కాంగ్రెస్ వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ భర్రే జహంగీర్ యూత్ కాంగ్రెస్ జిల్లా, పట్టణ అధ్యక్షులు మంగ ప్రవీణ్, ఎస్ఎస్సి జిల్లా అధ్యక్షులు మహేందర్ సన్నీ, సురేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు ఎన్.ఎస్.యు.ఐ నాయకులు తదితరులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.

# శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి

**జీవో నంబర్ 97ను రద్దు చేయాలి.. డిప్లొమా కోర్సులను ఐటీఐతో అనుసంధానం చేసే నిర్ణయాన్ని విరమించాలి**




**నారాయణఖేడ్, ఆగస్టు 25(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం శక్తి పాలసీని వెనక్కి తీసుకుని, రాష్ట్ర సాంకేతిక విద్యా మండలిని బలోపేతం చేయాలని కోరుతూ యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో అనితకు వినతిపత్రం అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం, డిప్లొమా కోర్సులను ఐటీఐ, ఏటీసీలతో అనుసంధానం చేసే నిర్ణయాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రవితేజ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలను ఐటీఐ, ఏటీసీలతో అనుసంధానం చేస్తూ శక్తి పాలసీని తీసుకురావడంతో విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి బీటెక్ వంటి ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. డిప్లొమా కోర్సులను ఇంజినీరింగ్ విద్యకు మరింత చేరువ చేయాల్సింది పోయి ఐటీఐ, ఏటీసీలతో అనుసంధానం చేయడం వల్ల విద్యార్థుల విద్యా, ఉపాధి అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్లొమా కోర్సులను ఉన్నతీకరించాల్సిన అవసరం ఉందని, వాటి స్థాయిని తగ్గించే నిర్ణయాలు సరికావని అన్నారు. ప్రభుత్వం శక్తి పాలసీని వెనక్కి తీసుకుని జీవో నంబర్ 97ను రద్దు చేయడంతో పాటు డిప్లొమా విద్యను గతంలో ఉన్న విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని రవితేజ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు సాయి, దిలీప్, రాజు, సాయికిరణ్, రమేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం ప్రత్యేక ఓటీల ఏర్పాటు

**క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం సంగ్య తండా పరిధిలో మల్లన్నసాగర్ 15వ, 16వ ప్యాకేజీలకు సంబంధించి కొండాపూర్ వద్ద కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి వచ్చే ప్రధాన కాల్వను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. కాల్వకు దిగువన ఉన్న గ్రామాలు, చెరువులు, ఆయకట్టు భూములకు సాగునీరు అందేలా ప్రత్యేక ఓటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంబంధిత ఇరిగేషన్ అధికారులతో కలిసి కాల్వ ప్రాంతాన్ని పరిశీలించి, రైతులకు నీరు అందించడంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా, అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ దిగువ ప్రాంతాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం రైతుల సంక్షేమానికి, సాగునీటి సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సాగునీటి వనరులను అభివృద్ధి చేసి, రైతుల పొలాలకు నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. బస్వాపూర్ ప్రాజెక్టు తో పాటు, గంధమల్ల ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే దిగువ ప్రాంతాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు, ఆయా ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. అందుకు గాను బస్వపూర్ భూ బాధితులకు నష్టపరిహారం, అదేవిధంగా గంధమల్ల భూభాధితులకు నష్టపరిహారం పూర్తి స్థాయిలో అందజేసి ప్రారంభిస్తామని అన్నారుఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో కాల్వలకు ప్రత్యేక ఓటీలను ఏర్పాటు చేసి అనేక చెరువులను నీటితో నింపగలిగామని ఎమ్మెల్యే తెలిపారు. బస్వాపూర్ వైపు వెళ్లే కాల్వలో మరో రెండు ప్రత్యేక ఓటీలను ఏర్పాటు చేయడం ద్వారా సుమారు 70 నుంచి 80 చెరువులకు నీటిని అందించే అవకాశం ఉందని చెప్పారు. ఈ ఓటీల ఏర్పాటు పూర్తయితే దిగువ ప్రాంతాల్లోని చెరువులు నిండడంతో భూగర్భ జలాలు పెరిగి, రైతులకు సాగునీటి లభ్యత మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, ఎస్ఈ, డీఈ, ఇతర సాంకేతిక సిబ్బంది సహకారంతో అవసరమైన ప్రాంతాలను గుర్తించి ఓటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని బీర్ల ఐలయ్య వెల్లడించారు. సాగునీటితో పాటు ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. షామీర్‌పేట్ మండలం ఘన్‌పూర్ వద్ద రూ.210 కోట్లతో నిర్మిస్తున్న మిషన్ భగీరథ కాలువ పనులను తాజాగా పర్యటించి పరిశీలించినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే నియోజకవర్గంలోని ప్రజలకు ప్రతిరోజూ ఎక్కువ పరిమాణంలో తాగునీరు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాల్వల ద్వారా సాధ్యమైనంత ఎక్కువ ప్రాంతాలకు నీటిని అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రైతుల పొలాలకు సాగునీరు అందించడం, చెరువులను నింపడం, నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు.

# ఇస్లాంలో హిజాబ్ తప్పనిసరి కాదు..!

**పాఠశాల యూనిఫామ్‌తో హిజాబ్‌కు అనుమతి కోరిన విద్యార్థిని పిటిషన్‌ను కొట్టివేసిన అలహాబాద్ హైకోర్టు**




**ప్రయాగ్‌రాజ్, ఆగస్టు 25 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** పాఠశాల నిర్దేశించిన యూనిఫామ్‌తో పాటు హిజాబ్ ధరించేందుకు అనుమతించాలని కోరుతూ ఓ ముస్లిం విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. ఇస్లాంలో హిజాబ్ ధరించడం తప్పనిసరి లేదా అత్యవసరమైన మతాచారం అని నిరూపించేందుకు తగిన ఆధారాలు లేవని ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ ఇంద్రజిత్ శుక్లాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. ప్రయాగ్‌రాజ్‌లోని అత్తర్‌సుయియా ప్రాంతంలో ఉన్న ఠాగూర్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని తన తల్లి ద్వారా పిటిషన్ దాఖలు చేసింది. పదో తరగతి పూర్తి చేసిన తాను అదే పాఠశాలలో 11వ తరగతిలో చేరాలని, పాఠశాల యూనిఫామ్‌తో పాటు హిజాబ్ ధరించేందుకు అనుమతించేలా పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించాలని కోర్టును కోరింది. తాను ఆరో తరగతి నుంచి హిజాబ్ ధరిస్తున్నానని, అది తన మత విశ్వాసంలో భాగమని విద్యార్థిని పిటిషన్‌లో పేర్కొంది. ఈ నెల 21న పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. హిజాబ్ ధరించకపోతే ఇస్లాం మతం ప్రాథమిక స్వరూపానికే ముప్పు వాటిల్లుతుందని నిరూపించే మతపరమైన గ్రంథాలు లేదా ఇతర ఆధారాలను పిటిషనర్ సమర్పించలేదని పేర్కొంది. అదే పాఠశాలలో ఇతర విద్యార్థినులు, అదే మతానికి చెందిన కొందరు విద్యార్థినులు కూడా హిజాబ్ ధరించడం లేదని ఫొటోల ఆధారంగా కోర్టు గమనించింది. హిజాబ్ ఇస్లాంలో తప్పనిసరి మతాచారం అనే వాదనకు తగిన ఆధారాలు లేవని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో ఇదే అంశాన్ని పరిశీలించిన పలు హైకోర్టులు కూడా హిజాబ్ అత్యవసరమైన మతాచారం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది.

# శాస్త్రీనగర్‌లో బస్తీ బాట

**బస్తీ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి. భానుక నర్మద**



**ఆగస్టు 25, కంటోన్మెంట్ (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు పరిధిలోని శాస్త్రీనగర్‌లో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు డ్రైనేజీ సమస్య, నాలా పూడిక, అక్రమ నిర్మాణాల తొలగింపు వంటి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన భానుక నర్మద సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. కంటోన్మెంట్ పరిధిలోని 8 వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అత్యవసర సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి లేదా కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలోని తమ ఛాంబర్‌కు తీసుకురావచ్చని తెలిపారు. ప్రజా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని భానుక నర్మద పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పవన్ కుమార్, సీనియర్ నాయకులు ప్రశాంత్, కార్యకర్తలు సునీల్, మురళి, లాల్, రాజేష్, ముర్గేష్, జైనాహో, బుజ్జి, జెస్సీ తదితరులతో పాటు బస్తీవాసులు పాల్గొన్నారు.

# రైతులరా.. మహత్తర రైతాంగ ఉద్యమాలకు సిద్ధం కావాలి

### ఆలేరు తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఏ.ఐ.కె.ఎం.ఎస్. రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** దేశంలో రైతుల పరిస్థితి రోజురోజుకు దారుణంగా తయారవుతుందని, గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా, విత్తనాలు ఎరువుల ధరలు పెంచుకుంటూ పోతున్నారని, మోడీ ప్రభుత్వం భారత వ్యవసాయాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టె ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నాడని, వీటికి వ్యతిరేకంగా మహత్తర రైతాంగ ఉద్యమాలకు సిద్ధం కావాలని అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ లు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 8,9 న మంచిర్యాలలో జరిగే తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడివయ్య, కుమార్ లు మాట్లాడుతూ... దేశంలో రైతులు, వ్యవసాయ కూలీలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, సాగు పెట్టుబడులు పెరగడం, నకిలీ విత్తనాలు--ఎరువుల సమస్యలు, పంటలకు సరైన మార్కెట్ సౌకర్యాలు లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. మరోవైపు వ్యవసాయ కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి లభించకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం




కష్టంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు రక్షణ కల్పించే విధానాల స్థానంలో కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. రైతులకు రుణభారం, పంట నష్టాలు, గిట్టుబాటు ధరల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు రుణభారాన్ని తగ్గించేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి, కనీస వేతనాలు, భూమి మరియు నివాస హక్కులు కల్పించడంతో పాటు గ్రామీణ పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల సమస్యలపై ఐక్యంగా పోరాడేందుకు సెప్టెంబర్ 8,9 న మంచిర్యాలలో జరిగే ఏఐకేఎంఎస్ రాష్ట్ర 9వ మహాసభలు కీలక వేదికగా నిలుస్తాయని వారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజాతంత్రవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు మామిడాల సోమయ్య, ఉపాధ్యక్షులు ఇక్కిరి సహదేవ్, చిరబోయిన రాజయ్య, సహాయ కార్యదర్శి మామిడాల బాలమల్లేష్, కోశాధికారి తమ్మడి అంజయ్య, గోపాల్ రెడ్డి, పద్మ సుదర్శన్, చిరబోయిన కొమురయ్య, ఇక్కిరి బీరయ్య, గోవిందు పరమేష్, జాలపు సుధాకర్ రెడ్డి, మాలోతు లాల్ తదితరులు పాల్గొన్నారు.

# చాట్‌జీపీటీ ఇక మిమ్మల్ని గమనిస్తుందా?

### కంప్యూటర్ కార్యకలాపాలు, సమావేశాలు, కాల్స్‌ను అర్థం చేసుకునే దిశగా అడుగులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25:**
కృత్రిమ మేధ రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో చాట్‌జీపీటీ భవిష్యత్తులో మరింత వ్యక్తిగత సహాయకుడిగా మారే అవకాశం ఉందని ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్ వెల్లడించారు. రానున్న కాలంలో వినియోగదారులు అనుమతించిన మేరకు వారి కంప్యూటర్ కార్యకలాపాలు, సమావేశాలు, కాల్స్ తదితర అంశాలను అర్థం చేసుకుని సహాయం చేసే సామర్థ్యాలను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు తమ ఈమెయిల్, సందేశాలు, పత్రాలు, ఇతర సేవలను




అనుసంధానించుకునే అవకాశం ఉంటుందని ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. దీంతో వినియోగదారులు రోజువారీగా చేస్తున్న పనుల నేపథ్యాన్ని అర్థం చేసుకుని తగిన సూచనలు ఇవ్వడం, చిన్నపాటి పనులను నిర్వహించడంలో కృత్రిమ మేధ సహకరించగలదని వివరించారు. అయితే ఇలాంటి సామర్థ్యాలు వ్యక్తిగత గోప్యతపై ఆందోళనలకు కూడా దారితీసే అవకాశం ఉంది. ఏ సమాచారాన్ని చాట్‌జీపీటీకి అందుబాటులో ఉంచాలన్నది వినియోగదారులే నిర్ణయిస్తారని ఆల్ట్‌మన్ స్పష్టం చేశారు. ఇప్పటికే కొన్ని పరికరాల్లో వినియోగదారుల కార్యకలాపాల నేపథ్యాన్ని అర్థం చేసుకునే సౌకర్యాలపై ఓపెన్‌ఏఐ పనిచేస్తోంది. ఈ పరిణామాలతో భవిష్యత్తులో కృత్రిమ మేధ వ్యక్తిగత డిజిటల్ సహాయకుడిగా మరింత కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ప్రతి విద్యార్థికి చట్టాలపై అవగాహన అవసరం

### మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై షీ టీమ్ అవగాహన

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25 (నారాయణఖేడ్):**
నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలం బోరంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంగారెడ్డి జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో నారాయణఖేడ్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జి ఏఎస్ఐ తులసిరాం మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని




సూచించారు. మహిళల రక్షణ, మహిళల హక్కులు, బాలల రక్షణ చట్టాలు, పని ప్రదేశాల్లో వేధింపుల వంటి అంశాలపై అవగాహన అవసరమన్నారు. ఫేక్ ఖాతాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, సైబర్ వేధింపుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, సైబర్ నేరాల కోసం 1930, బాలల సహాయం కోసం 1098, సంగారెడ్డి షీ టీమ్ కోసం 8712656772 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో షీ టీమ్ కానిస్టేబుల్ చాంగుబాయి, ప్రధానోపాధ్యాయులు శివకుమార్ స్వామి, ఉపాధ్యాయులు, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు. మహిళల భద్రత, బాలల సంక్షేమం, సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

# ఫీజు బకాయిలు చెల్లించలేని ప్రభుత్వం.. విదేశీ విద్య మాటలా?

### విద్యాసంస్థలు సంక్షోభంలో ఉంటే ప్రపంచస్థాయి వర్సిటీల మాటలు హాస్యాస్పదం.

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, తెలంగాణ బ్యూరో, ఆగస్టు 25:**
తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యాసంస్థలను సంక్షోభంలోకి నెడుతూ, విదేశీ విద్యాసంస్థలను రాష్ట్రానికి తీసుకొస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. రాష్ట్రంలోని విద్యాసంస్థలకు కనీస సౌకర్యాలు కల్పించలేని ప్రభుత్వం ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలను తీసుకొస్తామని చెప్పడం విడ్డూరమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోవడంతో వేలాది కళాశాలలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది జీతాలు, నిర్వహణ ఖర్చులు చెల్లించలేక కళాశాలల యాజమాన్యాలు అప్పుల పాలవుతున్నాయని ఆరోపించారు. బకాయిల కారణంగా విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం బకాయిలను ఒకేసారి చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ముఖ్యమంత్రిని బండి సంజయ్ ప్రశ్నించారు. ఫీజు బకాయిల సమస్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు చేపట్టిన దీక్షకు



సంపూర్ణ మద్దతు ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తు, కళాశాలల మనుగడను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# పచ్చదనానికి శ్రీకారం చుట్టిన సర్పంచ్

### మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత: ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి



**నర్సింహులపేట, ఆగస్టు 25(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
నర్సింహులపేట మండలం కౌసల్యదేవిపల్లి గ్రామంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామంలో పచ్చదనం పెంపొందితే పరిశుభ్రమైన వాతావరణంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాణోతు రవి నాయక్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధైర్యపడకండి.. అండగా ఉంటాను

### బండలగూడ రైల్వే భూముల నిర్వాసితులకు ఎమ్మెల్యే జీఎంఆర్ భరోసా



**పటాన్‌చెరు, ఆగస్టు 25 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని బండలగూడ రైల్వే భూముల అంశంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానిక ప్రజాప్రతినిధిగా అండగా ఉంటానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) నిర్వాసితులకు భరోసా ఇచ్చారు. మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ నేతృత్వంలోని నిర్వాసితుల బృందం సోమవారం సాయంత్రం ఎమ్మెల్యేను కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత 50 ఏళ్లుగా బండలగూడలో గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను రైల్వే భూముల పేరుతో ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు. ఈ అంశంపై సంబంధిత రైల్వే అధికారులతో చర్చిస్తామని తెలిపారు. అవసరమైతే నిర్వాసితుల తరపున భారీ నిరసన కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# బీరంగూడ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి: సహాయ కమిషనర్ విజయ రామారావు




**అమీన్‌పూర్, ఆగస్టు 25 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామారావు బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అభివృద్ధిపై అధికారులతో సమావేశమయ్యారు. ఆలయ ఈవో దేవనాదం, చైర్మన్ సుధాకర్ యాదవ్, కమిటీ సభ్యులు, అధికారులు, అర్చకులు, సిబ్బందితో సమావేశమైన విజయ రామారావు ఆలయ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేసిన ఆయన.. త్వరలోనే ఆలయ ప్రాంగణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు పిలుపు

**పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి.**




**హైదరాబాద్ పల్స్ న్యూస్,
కోహీర్, ఆగస్టు 25:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలం గురుజువాడ గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు లక్ష్యంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొని మొక్కలు నాటారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని సర్పంచ్ ప్రియాంక రాజేందర్ సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను గ్రామస్తులు తీసుకోవాలని కోరారు. మొక్కలు నాటడం ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా వాటి సంరక్షణపై నిరంతరం దృష్టి పెట్టాలని అన్నారు. "పచ్చని గ్రామమే ఆరోగ్యకరమైన గ్రామం. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి" అని ప్రియాంక రాజేందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్, జీపీ ఓ వెంకటేష్, క్షేత్ర సహాయకుడు శ్రీశైలం, ఆశా కార్యకర్తలు అనసూయ, సుమలతతో పాటు గ్రామస్తులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. గ్రామంలో మరిన్ని ప్రాంతాల్లో పచ్చదనం పెంచేందుకు నిరంతరం కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ తెలిపారు.




# వికలాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, చర్ల :**
దివ్యాంగుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆటల పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి పి. వెంకటరమణ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం సత్యనారాయణపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖ తరపున జి. సతీష్, కే. స్వప్న ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పి. వెంకటరమణ మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థుల్లో విభిన్నమైన సామర్థ్యాలు ఉంటాయని, వారిలోనూ ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. వారి నైపుణ్యాలను వెలికితీయడంతో పాటు, తోటి విద్యార్థులతో తాము సమానంగా ప్రతిభ చాటగలమనే ఆత్మవిశ్వాసాన్ని కల్పించడమే ఆటల పోటీల ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన దివ్యాంగ విద్యార్థులకు ధ్రువపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణపురం జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు.. సెప్టెంబర్ 15లోపు దరఖాస్తు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, తెలంగాణ డెస్క్, ఆగస్టు 25:**
బీసీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం 'ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని అమలు చేస్తోంది. అర్హులైన మహిళలు సెప్టెంబర్ 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ పథకానికి 18 నుంచి 55 ఏళ్ల వయసున్న బీసీ మహిళలు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల లోపు ఉండాలి. అర్హత కలిగిన మహిళలు అధికారిక దరఖాస్తు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అవసరమైన పత్రాలు, ఇతర వివరాల కోసం సంబంధిత బీసీ అభివృద్ధి అధికారులను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# మతం మారాలని సౌజన్య పై సాధిక్‌ఖాన్ ఒత్తిడి: కాకినాడ ఎస్పీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్,
కాకినాడ, ఆగస్టు 25:**
ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య వేర్వేరుగా రాసిన ఆత్మహత్య లేఖలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, వాటిలో రైఫిల్ షూటింగ్ శిక్షకుడు సాధిక్‌ఖాన్ వేధింపుల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారని వెల్లడించారు. సౌజన్య మతం మారాలని సాధిక్‌ఖాన్ ఒత్తిడి తెచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైందని ఎస్పీ తెలిపారు. సౌజన్య మామ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితుడి కోసం కాకినాడ, తూర్పుగోదావరి



జిల్లాల నుంచి 10 పోలీసు బృందాలతో ఐదు రాష్ట్రాల్లో గాలింపు చేపట్టి, చివరకు ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో అతడిని గుర్తించి అరెస్టు చేసినట్లు వెల్లడించారు. స్థానిక కోర్టులో హాజరుపరిచి రవాణా వారెంట్‌పై కాకినాడకు తీసుకొచ్చినట్లు తెలిపారు. కుటుంబం ఆత్మహత్య ఘటన అనంతరం సాధిక్‌ఖాన్ మేరఠ్‌కు వెళ్లి స్నేహితుల వద్ద ఆశ్రయం పొందినట్లు ఎస్పీ పేర్కొన్నారు. అతడిపై వస్తున్న ఇతర ఆరోపణలపైనా దర్యాప్తు కొనసాగుతోందన్నారు. హత్య, బలవంతపు మతమార్పిడి ఆరోపణలకు సంబంధించిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బాధితులు ఘటనకు ముందు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, ఇబ్బందులు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు.

**సాధిక్‌ఖాన్‌కు 14 రోజుల రిమాండ్**

సాధిక్‌ఖాన్‌ను పోలీసులు కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం అతడిని కాకినాడ సబ్‌జైలుకు తరలించారు. నిందితుడిని వారం రోజుల పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సర్పవరం పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

# ఏడేళ్ల తర్వాత భారత్‌కు జిన్‌పింగ్.. 400 మందితో భారీ బృందం!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, మెయిన్ డెస్క్:**
వచ్చే నెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పర్యటన ఖరారైతే 2019 తర్వాత దాదాపు ఏడేళ్లకు ఆయన భారత్‌కు రావడం ఇదే తొలిసారి అవుతుంది. సుమారు 400 మంది అధికారులతో కూడిన భారీ ప్రతినిధి బృందంతో జిన్‌పింగ్ భారత్‌కు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే ఆయన పర్యటన, షెడ్యూల్‌పై చైనా నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. జిన్‌పింగ్ పర్యటనపై వార్తలు వస్తున్న సమయంలోనే భారత్--చైనా మధ్య ఉన్నతస్థాయి చర్చలు కొనసాగుతున్నాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ చైనాలో పర్యటిస్తూ సరిహద్దు అంశాలతో పాటు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరుపుతున్నారు. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత ఇరుదేశాల సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2024లో సైనిక ఉపసంహరణకు సంబంధించి ఒప్పందం తర్వాత పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయి. ప్రత్యక్ష విమాన సర్వీసుల పునరుద్ధరణ, కైలాస్ మానస సరోవర్ యాత్ర తిరిగి ప్రారంభం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్




భారత్‌కు వచ్చి ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయితే.. భారత్--చైనా సంబంధాల్లో కీలక పరిణామంగా మారే అవకాశం ఉంది.

# హెచ్1ఎన్1 కేసుల పెరుగుదలపై ఆందోళన.. కొత్త వైరస్ కాదన్న ఐసీఎంఆర్

**హైదరాబాద్ పల్స్ న్యూస్,
న్యూఢిల్లీ, ఆగస్టు 25:**
దేశ రాజధాని ఢిల్లీలో హెచ్1ఎన్1 కేసులు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 1,777 కేసులు నమోదైనట్లు సమాచారం. గతేడాది ఇదే కాలంలో 229 కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఆగస్టు 20న ఒక్కరోజే 114 కొత్త కేసులు వెలుగుచూశాయి. ఆసుపత్రుల్లో చేరుతున్న కొందరు రోగుల్లో దీర్ఘకాలిక దగ్గు, న్యుమోనియా, ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం, విరేచనాలు, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

**కొత్త వైరస్ రూపాంతరం కాదు**

కేసుల పెరుగుదల నేపథ్యంలో కొత్త వైరస్ లేదా కొత్త రూపాంతరం వ్యాపిస్తోందన్న ఆందోళనలపై భారత




వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం వ్యాపిస్తున్న హెచ్1ఎన్1 వైరస్ కొత్తది కాదని, 2025 నుంచే చలామణిలో ఉందని తెలిపింది. ప్రస్తుత ఫ్లూ టీకాలు వైరస్‌ను ఎదుర్కోవడంలో ఉపయోగపడతాయని పేర్కొంది.

**ఎవరు అప్రమత్తంగా ఉండాలి?**

చిన్నారులు, వృద్ధులు, గుండె లేదా ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారికి ఫ్లూ తీవ్రంగా మారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన లక్షణాలు ఉన్నవారు వైద్యుల సలహాతోనే యాంటీవైరల్ మందులు వాడాలని సూచిస్తున్నారు.

**పాటించాల్సిన జాగ్రత్తలు**

రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించడం, చేతులను తరచూ శుభ్రం చేసుకోవడం, వార్షిక ఫ్లూ టీకా తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం, తీవ్రమైన లేదా నిరంతర దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

# టీఆర్పీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మహమ్మద్ అన్జద్ పాషా నియామకం

**నియామక పత్రం అందజేసిన టీఆర్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా సీనియర్ నాయకులు మహమ్మద్ అన్జద్ పాషా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మహమ్మద్ అన్జద్ పాషా కు నియామక పత్రం అందజేసిన టీఆర్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పార్టీకి నిస్వార్థంగా సేవలందిస్తూ, మైనార్టీల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న అన్జద్ పాషా సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీ ఈ బాధ్యతలను అప్పగించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఆదేశాల మేరకు ఈ నియామక ఉత్తర్వులను జారీ చేశారు.

ఈ సందర్భంగా నూతన రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అన్జద్ పాషా మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్నకి, మరియు రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు సల్మాన్ కి, రాష్ట్ర నాయకత్వానికి మరియు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మైనార్టీ సోదరుల సమస్యలను ప్రభుత్వం, పార్టీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీని గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేయడానికి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి శక్తివంచన లేకుండా పని చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నర్సయ్య గౌడ్, జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జిట్టబోయిన నరేష్, మమ్ము, వంశీ తదితరులు పాల్గొన్నారు

# వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ ప్రాథమిక సమావేశం

**పాల్గొన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

**హైదరాబాద్ పల్స్ న్యూస్,
ఆగస్టు 25,
తెలంగాణ బ్యూరో :**
హైదరాబాద్, తెలంగాణ శాసనసభలో ఏర్పాటు చేసిన వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ (2026-27) ప్రాథమిక సమావేశం మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యుడైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమం, వారి సమస్యలు, అభివృద్ధి, హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై కమిటీ సభ్యులు విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా బీసీలకు విద్య, ఉపాధి, ఆర్థిక మరియు సామాజిక రంగాల్లో మరింత అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమం మరియు అభివృద్ధి విషయంలో మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. అర్హులైన ప్రతి బీసీ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ రాష్ట్రంలోని ఇతర కమిటీల కంటే మరింత చురుకుగా పనిచేసి, బీసీల పక్షాన నిరంతరం ఆలోచిస్తూ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి ద్వారా ఇంప్లిమెంట్ చేసే విధంగా ఈ కమిటీ పని చేయాలని మల్లన్న అన్నారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతకు ఈ కమిటీ కీలక వేదికగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# బి.పి మండల్ స్ఫూర్తితో బి.సి లు స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగాలి

## ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్

## హనుమకొండలో బి.పి మండల్ 108వ జయంతి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 25, తెలంగాణ బ్యూరో :**

వెనుకబడిన వర్గాలు (ఒబిసి) ల సుదీర్ఘ పోరాటం వల్ల నియమించబడిన మండల్ కమీషన్ నివేదికను బి.సి ల అభివృద్ధికి మేలు చేసే విధంగా అందించిన బి.పి మండల్ (బ్రిందేశ్వర్ ప్రసాద్ మండల్) స్ఫూర్తితో బి.సి లు స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగాలని ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ లో మంగళవారం జరిగిన బి.పి మండల్ 108 వ జయంతికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బి.సి నాయకుల పోరాటం వల్ల నియమించబడిన బి.పి మండల్ ఎంతో శ్రమకోర్చి నివేదికలో 40 అభివృద్ధి సూచనలు పొందుపరచి 40 ఏండ్లు కావస్తున్నా ఆ అంశాల అమలు పట్ల ఈ దేశ పాలకులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. మండల్ నివేదికలోని అంశాల అమలు కోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరముందని అన్నారు. 1980 లో సమర్పించిన బి.పి మండల్ కమీషన్ నివేదికను 1990 లో ఆనాటి ప్రధాని వి.పి సింగ్ అమలు చేయడానికి పార్లమెంటులో ప్రకటించగానే దేశంలోని రాజకీయ పార్టీలన్నీ ఒకటే గగ్గోలు పెట్టాయని ఆనాటి బిజెపి పార్టీ మద్దతు ఉపసంహరించుకుని వి.పి సింగ్ ప్రభుత్వాన్ని కూలదోసిందని, ఆనాటి నుండి నేటి వరకు బిజెపి ప్రభుత్వం బి.సి లకు వ్యతిరేకంగానే పాలన చేస్తుందని అన్నారు. ఇండియా జనాభాలో 60 శాతం పైగానున్న బి.సి సమాజం ఆది మానవుడి నుండి ఆధునిక మానవ సమాజం వరకు ఎన్నో ఆవిష్కరణలు చేసి అన్ని రంగాల్లో సేవలు అందించి స్వాభిమానంతో జీవించిన బి.సి లు నేడు బతకలేక బలిదానాలు చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి.సి ఇంటలెక్టువల్ ఫోరం రాష్ట్ర నాయకులు డాక్టర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ... భారతదేశంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లకు వంద సంవత్సరాలకు పైనే చరిత్ర ఉందని, స్వాతంత్రానికి పూర్వమే బ్రిటిష్ పాలనలో కొన్ని ప్రాంతాల్లో, కొన్ని స్వదేశీ సంస్థానాల్లో రిజర్వేషన్లు ఉండేవి. భారత రాజ్యాంగానికి మొట్టమొదటి సవరణ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించడం కోసమే చేయబడిందంటే వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ల ప్రాముఖ్యత ఎంతో అర్థం చేసుకోవాలి. రిజర్వేషన్లు రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలకు (ఆర్టికల్ 15&16) వ్యతిరేకమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. సుప్రీంకోర్టు తీర్పు వ్యతిరేకంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లకు మద్దతుగా పెరియార్ చేసిన ఉద్యమంతో 1951 లో పార్లమెంటు లో మొట్టమొదటి రాజ్యాంగ సవరణ చేపట్టి ఆర్టికల్ 15 కు క్లాజు 4 ను చేర్చి ప్రభుత్వం సామాజికంగాను, విద్యా పరంగానూ వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చని ఆ క్లాజులో పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణ జరిగి 75 ఏండ్లు దాటినా, మండల్ కమీషన్ నివేదిక ఇచ్చి 40 ఏండ్లు దాటినా బి.సి ల బతుకులు మారలేదని దేశాన్ని పాలించే ఆధిపత్య దోపిడి కులాల పాలకులే దీనికి కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆల్ ఇండియా ఒబిసి జాక్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు తాడిశెట్టి క్రాంతికుమార్ మాట్లాడుతూ బి.పి మండల్ నీతి నిజాయితీకి మారు పేరుగా నిలిచారని, ఆగస్టు 25,




1918 లో బీహార్ రాష్ట్రం మధేపూర్ జిల్లా మోరో గ్రామంలో రాస్ బీహారీ లాల్ మండల్ జమీందారి కుటుంబంలో జన్మించిన బి.పి మండల్ 23 ఏటనే జిల్లా కౌన్సిల్ కు ఎన్నికయ్యారు. జీతం తీసుకోకుండా జుడిషియల్ మేజిస్ట్రేట్ గా పనిచేశారు. 1952 మొదటిసారిగా శాసనసభకు ఎన్నికైన మండల్ ఆరోగ్య శాఖ మంత్రిగా, ఎం.పి గా పనిచేశారు. రామ్ మనోహర్ లోహియా నాయకత్వంలో పనిచేసిన మండల్ 1967 లో బీహార్ లో జరిగిన ఎన్నికల్లో 69 మంది ఎమ్మెల్యేలను గెలిపించి ఫిబ్రవరి 1968 లో బీహార్ ముఖ్యమంత్రిగా పదవి చేపట్టారు. బయట నుండి మద్దతునిచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకుల అవినీతిపై విచారణ జరిగితే ఆ విచారణ బుట్టదాకలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల్ పై ఒత్తిడి చేసింది. అయినా నిజాయితీగా కాంగ్రెస్ అవినీతి నాయకులపై చర్య తీసుకున్నారు. దాంతో కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రభుత్వం కూలిపోయింది తన ప్రభుత్వం కూలిపోతుందని తెలిసిన నీతికోసం నిలబడిన నాయకుడు బి.పి. మండల్ 1974 లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి లోక్ నాయక్ జయప్రకాష్ నాయకత్వంలో అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని 1977 లో జనతా పార్టీ తరుపున లోక్ సభకు ఎన్నికయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాది రాచకొండ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... కాంగ్రెస్, బిజెపి రెండు బి.సి వ్యతిరేక పార్టీలేనని, అన్ని పార్టీల కన్నాఎక్కువ కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్, గత 12 ఏండ్లుగా పాలిస్తున్న బిజెపి బి.సి లకు వ్యతిరేక పార్టీలే. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు బి.సి జనగణన చేయనప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి తాము అధికారంలోకి వస్తే ఒబిసి జనగణన చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒబిసి జనగణన సాధ్యం కాదని నిస్సిగ్గుగా చెప్పి దేశంలోని 80 కోట్ల ఒబిసి లకు మోసం చేసింది. పూర్వ కాంగ్రెస్ పాలకులు ఒబిసి ల సమస్యలను సరిగా అర్థం చేసుకోకుండా ఒబిసి లకు అన్యాయం చేసిందని, ఇకముందు ఒబిసి లకు న్యాయం చేస్తామని, కుల జనగణన సామాజిక న్యాయానికి ఎక్స్ రే లాంటిదని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల జనగణన జరిపి రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. తెలంగాణ ఎన్నికల ముందు పెద్ద బహిరంగ సభ పెట్టి స్థానిక సంస్థల్లో బి.సి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించి మూడు ఏండ్లు కావస్తున్నా దిక్కు లేని స్థితి అని 42 శాతం రిజర్వేషన్లకు ఉన్న రాజ్యాంగపర అడ్డంకులను తొలగించడంలో కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం శూన్యమని అన్నారు. వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ... బి.సి ల సమస్యల సాధన కోసం, బి.సి జనగణన కోసం, బి.సి లకు విద్య, ఉద్యోగ, చట్టసభల్లో బి.సి లకు రిజర్వేషన్ల కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతున్నాయని అన్నారు. రాజ్యాధికారం ద్వారానే బి.సి లకు విముక్తి జరుగుతుందని అన్నారు. ఈ క్రమంలో కులాలుగా విడగొట్టబడిన బి.సి లు ఏకమై పార్టీలకు, సంఘాలకు అతీతంగా ఐక్యమై బి.పి మండల్ ఆదర్శంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి.ఐ.ఎఫ్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కూరపాటి రమేష్, ఐ ఎల్ పి ఎ రాష్ట్ర నాయకులు న్యాయవాది జన్ను పద్మ, అసంఘటిత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు నలిగింటి చంద్రమౌళి, ఆల్ ఇండియా ఒబిసి జాక్ నాయకులు తాడిశెట్టి క్రాంతి కుమార్, జల్లెల కృష్ణమూర్తి, సద్గుణ, తాడిశెట్టి కార్తీక్, గొల్లపల్లి, వీరస్వామి, రాచకొండ ప్రవీణ్ కుమార్, మడేల్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# మందులతో తగ్గని ఎపిలెప్సీకి శస్త్రచికిత్సతో యశోద వైద్యులు చెక్

## భువనగిరికి చెందిన బాలిక వాగ్దేవికి విజయవంతంగా శాస్త్ర చికిత్స

**హైదరాబాద్ పల్స్ న్యూస్, తెలంగాణ బ్యూరో, ఆగస్టు 25:**

యాంటీ-సీజర్ మందులతోనూ నియంత్రణలోకి రాని తీవ్రమైన ఎపిలెప్సీతో బాధపడుతున్న రెండేళ్ల బాలికకు సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ వైద్యులు అత్యాధునిక మెదడు శస్త్రచికిత్స నిర్వహించారు. భువనగిరికి చెందిన బాలిక వాగ్దేవికి విజయవంతంగా చికిత్స అందించడంతో ప్రస్తుతం మూర్ఛలు లేకుండా ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆరు నెలల వయస్సు నుంచే బాలికకు ప్రతిరోజూ తీవ్రమైన మూర్ఛలు వచ్చేవి. పలు రకాల మందులు వాడినా నియంత్రణలోకి రాకపోవడంతో పాటు మాట, శారీరక, మానసిక అభివృద్ధిలోనూ ఆలస్యం ఏర్పడింది. జూలై 26న ఆసుపత్రికి తీసుకురాగా నిర్వహించిన ఎంఆర్ఐ, పీఈటీ-సీటీ పరీక్షల్లో ఎడమ టెంపోరల్ ప్రాంతంలో అమిగ్డాలా, హిప్పోక్యాంపస్ సమీపంలో అసాధారణ కణజాలం గుర్తించారు. సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ ఆర్. అయ్యదురై నేతృత్వంలోని వైద్య బృందం అంటీరియర్ టెంపోరల్ లోబెక్టమీ ద్వారా




మూర్ఛలకు కారణమైన కణజాలాన్ని తొలగించింది. శస్త్రచికిత్స సమయంలో ఎలక్ట్రోకార్టికోగ్రఫీ, న్యూరోమానిటరింగ్ సాంకేతికతలతో మెదడు కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించారు. శస్త్రచికిత్స అనంతరం బాలికకు మళ్లీ మూర్ఛలు రాకపోవడంతో వారం రోజుల్లో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. మందులతో మూర్ఛలు నియంత్రణలోకి రాని పిల్లలను తల్లిదండ్రులు ఆలస్యం చేయకుండా ఎపిలెప్సీ నిపుణులను సంప్రదించాలని సీనియర్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్. వర్షా మోనికా రెడ్డి సూచించారు.

# ట్రీసా-గాయత్రి జోడీకి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

ఇంటర్నెట్ డెస్క్: భారత స్టార్ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, ప్లేయర్లు గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీలు మంగళవారం జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఇటీవల జరిగిన బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్ విభాగంలో ట్రీసా-గాయత్రి కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్ వారిని అభినందించారు. అంతర్జాతీయ వేదికపై అద్భుత ప్రతిభ కనబరిచి పతకం సాధించినందుకు ట్రీసా, గాయత్రిలను ప్రశంసించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల భవిష్యత్ ప్రస్థానానికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణకు, దేశానికి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు బ్యాడ్మింటన్ మాజీ క్రీడాకారిణి పి.వి.వి. లక్ష్మి పాల్గొన్నారు. ప్రముఖ కోచ్ పుల్లెల గోపీచంద్ కూడా సీఎంతో పలు అంశాలపై చర్చించారు.

ట్రీసా-గాయత్రి రికార్డు

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్ విభాగంలో గాయత్రి-ట్రీసా జోడీ కాంస్య పతకం సాధించింది. సెమీ ఫైనల్‌లో చైనా జోడీపై ఓటమి



పాలవ్వడంతో కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే 2011 తర్వాత పతకం గెలిచిన తొలి జట్టుగా ట్రీసా-గాయత్రి రికార్డు నెలకొల్పారు.

# SPORTS

## అంపైర్లతో గొడవ.. శ్రీలంక బౌలర్ ప్రభాత్ జయసూర్యపై ఐసీసీ చర్యలు



ఇంటర్నెట్ డెస్క్: శ్రీలంక బౌలర్ ప్రభాత్ జయసూర్యపై ఐసీసీ చర్యలు తీసుకుంది. లెవల్ 1 కోడ్ ఉల్లంఘనకు పాల్పడినందుకు మందలించడం సహా ఒక డీమెరిట్ పాయింట్‌ను విధించింది. భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ప్రభాత్ జయసూర్య తీవ్ర అసహనానికి గురయ్యాడు. మ్యాచ్ రెండో రోజు చివరి బంతికి ఔటైన అనంతరం అతడి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అంపైర్ల వైపు బిగ్గరగా చూస్తూ.. బ్యాట్‌తో బౌండరీ లైన్లను బాదాడు. డగౌట్‌లోనూ కోపంగా కనిపించాడు. దీనిపై ఐసీసీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. మ్యాచ్ రెండో రోజు వెలుతురు సరిగ్గా లేదంటూ జయసూర్య అంపైర్లతో గొడవకు దిగాడు. ఆ తర్వాత మ్యాచ్ చివరి బంతికి ఔటైన అనంతరం పెవిలియన్‌కు వెళ్తున్న సమయంలో పదే పదే వెనక్కి తిరిగి అంపైర్ల వైపు కోపంగా చూస్తూ వెళ్లాడు. డ్రెస్సింగ్ రూమ్‌కు చేరుకున్న తర్వాత తన గ్లౌజ్‌లను విసిరేశాడు. పెవిలియన్‌కు తిరిగి వెళ్తున్న సమయంలో బౌండరీ వద్ద ఉన్న వెడ్జ్‌లను తన బ్యాట్‌తో కొట్టాడు. అంతర్జాతీయ మ్యాచ్‌లో క్రికెట్ పరికరాలు, దుస్తులు, గ్రౌండ్ పరికరాలు లేదా ఇతర సామగ్రిని దుర్వినియోగం చేయడాన్ని నిబంధనల ప్రకారం తప్పిదంగా పరిగణిస్తారు. ఈ కారణంగా కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.2 కింద జయసూర్యపై ఐసీసీ చర్యలు తీసుకుంది.

తొలి తప్పిదం కావడంతో..

జయసూర్య చేసిన తప్పును అంగీకరించాడు. ఎమిరేట్స్ ఐసీసీ ఎలైట్ ప్యానెల్ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ప్రతిపాదించిన శిక్షను కూడా అంగీకరించడంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే వ్యవహారం ముగిసింది. గత 24 నెలల్లో జయసూర్య చేసిన తొలి తప్పిదం కావడంతో అధికారిక మందలింపుతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ విధించారు. ఇదిలా ఉంటే, భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్, శ్రీలంక బౌలర్ అసిత ఫెర్నాండో మధ్య కూడా వాగ్వాదం జరిగిన సంగతి తెలిసిందే. ఇద్దరిపై ఐసీసీ 25 శాతం మ్యాచ్ ఫీజులో కోతతో పాటు తలో డీమెరిట్ పాయింట్ విధించింది.